ఫ్లైట్ టేకాఫ్ అయింది. క్షణాల్లో విమానం గాలిలోకి ఎగిరింది. పక్కనే కూచున్న నా శ్రీమతి భయ సంభ్రమాలతో నా చెయ్యి గట్టిగా పట్టుకుంది. ఏం భయం లేదు అన్నట్టుగా ఆమె వైపు చూసి చిన్నగా నవ్వాను. నిజం చెప్పాలంటే నాక్కూడా కొంచెం దడగానే వుంది. కిటికీలోంచి కిందికి చూశాను. హైదరాబాద్ నగరపు ఆకాశ హర్మ్యాలు పిల్లలాడుకునే చిన్న చిన్న అగ్గిపెట్టెల్లా ఉన్నాయి. స్లోమోషన్ పిక్చర్‌లా నగరం మెల్లగా వెనక్కి కదులుతుంది.

# మరపురాని క్షణాలు...!

**దిలావర్**

కథ

ఎక్జిక్యూటివ్ క్లాస్‌ను ఆనుకొని ఉన్న ఎకానమీ క్లాసులో మేం కూర్చున్నాం. మేం కూచున్న హాలులాంటివే వెనుక భాగాన నాలుగైదు ఉన్నాయి. ప్రతి హాలుకు ఒక ఎయిర్ హోస్టెస్ సేవలు అందిస్తున్నది. ప్రతి ముందు సీటు వెనుక భాగాన ఒక అతి చిన్న బుల్లి తెర అమర్చబడివుంది. అందులో 'మలేషియా ఎయిర్ లైన్స్ మీకు స్వాగతం పలుకుతున్నది' అంటూ ప్రకటనలు మొదలయ్యాయి. బెల్టు పెట్టుకోవడం దగ్గర్నుండి, లైఫ్ జాకెట్ ఉపయోగించడం మొదలైన జాగ్రత్తలు వివరిస్తున్నది ఒక అమ్మాయి. ఇంతలో ఎయిర్ హోస్టెస్ ట్రేలో, వేడినీటిలో తడిపిన టిష్యూపేపర్లు తెచ్చి తలా ఒకటి అందించింది. వాటితో ప్రయాణికులు ముఖాలు తుడుచుకొని కొంచెం తేరుకున్నారు. తరువాత చక్రాల బండిమీద ఏవేవో స్నాక్స్ తీసుకొచ్చి యిచ్చింది. కత్తులూ కటార్లతో వాటిని తినడానికి మా ఆవిడ పడుతున్న అవస్థలు చూసి నవ్వొచ్చింది.

ఎంత సేపటికి ఏం తోచని ఒంటరితనం ఏదో ఆవహించి ఉన్నట్టు అనిపిస్తుంది. విమానం ముందుకు దూసుకెళుతుంటే నా ఆలోచనలు వెనక్కి పరుగెత్తుతూ...

మా జీతగాడు ఎడ్లబండి ముందు పగ్గాలు పట్టుకొని నడుస్తున్నాడు. బండిమీద వడ్లబోరెం ముందు భాగాన కూచొని చెర్నాకోలతో నేను ఎడ్లను అదిలిస్తున్నాను. నా పక్కనే మా మేనమామ కూతురు కూచొని ఉంది. ఒడిలోంచి, పసిమితో నిగనిగ లాడుతున్న జాంకాయ తీసింది. మా వయసులా జాంకాయా దోరగా ఉంది.

"భలే ఉంది కదూ జాంకాయ?" అంటూ ఊరిస్తూ గభాల్న నోట్లో పెట్టుకోబోయింది తను. నాకూ నోరూరుతుంది. "ఆగాగు, నువ్వు నోట్లో పెట్టుకుంటే మరి నాకు?" అన్నాను వారిస్తూ. "నేను సగం తిని నీకిస్తా" అన్నది తను జాంకాయను తిరిగి నోటి దగ్గర పెట్టుకుంటూ. "ఛీ!ఛీ! నీఎంగిలి నేనెలా తింటాను?" వికారంగా మొఖం పెట్టి బింకంగా అన్నాను. "పోని కాకెంగిలి చేసి తిందాం" రాజీకొస్తూ అన్నది తను.

"ఏమొద్దు... చెరోవైపు కొరుక్కొని తిందాం" అన్నాడు ఆశగా.

ఓరగా నావైపు చూసి "సరే" అంది. ఆనాడు .... నానా అవస్థలు పడుతూ జాంకాయను చెరోవైపు కొరుక్కుతిన్నాం. బతుకు రుచిలో ఉప్పెంతో, కారమెంతో తెలియని ఆ వయస్సు నుండి మొదలు పెట్టి, జీవన ఫలాలను ఇప్పటిదాకా చెరిసగం పంచుకొని అనుభవిస్తూనే వస్తున్నాం.

పొలాల దుగాల మీదా, చేల గట్లమీదా చెట్టపట్టాలు వేసుకొని తువ్వా యిల్లా పరిగెత్తిన ఆ కుర్రాడూ, కుర్రది ముందు ముందు ఒక నాడు ఇలా విమానంలో ప్రయాణించవలసి వస్తుందని కలలో కూడా అనుకుని ఉండరు...

ఆ దృశ్యం గుర్తుకొచ్చి మనసులోంచి నవ్వు తీసుకొచ్చింది. "ఎంటో నవ్వుతున్నారు?" అని ఇంగ్లీషులో అడిగింది ఎయిర్ హోస్టెస్. తలపైకెత్తి చూశాను. ఆమె నావైపు తదేకంగా చూడటం గమనించాను. ఆమె చూపులు నా గుండెల్లోకి చొచ్చుకుపోతున్నట్టున్నాయి. లేత నీలం రంగు పూలపూల కమీజు. అదేడిజైనులో ఉన్న లుంగీ. పైకి దువ్వి, తల వెనుక భాగాన అంటుకు పోయేలా గుండ్రంగా ముడిచిన కురులు. వాటి మీద నిలువుగా పెట్టుకున్న గులాబిరంగు పిన్ను. చంద్రునిలోంచి ఓ ముక్కను తీసి ఆమెను తయారు చేశాడేమో సృష్టికర్త. చందనపు ఛాయ మేని నిగారింపుతో, బంగారపు తీగలా మెరిసి పోతుంది. నీలాంబరపు అగాథాలను తమలో దాచుకున్నట్టు ఉన్నాయి ఆమె కళ్ళు. సుతారంగా వంపు తిరిగి లతల్లా ఒకదాన్ని ఒకటి పెనవేసుకున్నట్టు ఉన్న పెదాలు సన్నని నవ్వుల విరజాజుల్ని విరబూస్తున్నాయి.

అమ్మాయిల్ని చూడగానే చలించే వయసు కాదు నాది. అయినా గానీ ఎందుకో విచలితుణ్ణయ్యాను. 'రమ్యాణి వీక్ష్య మధురాంశ...' అనుకుంటూ, మెదడు పొరలలో నిక్షిప్తమైవున్న కాళిదాసు నన్ను సమర్థించడానికి పరుగు పరుగున బయటికొచ్చాడు. జన్మజన్మల వాసనా బలమేదో నన్ను ఉద్విగ్న పరుస్తుంది. చిత్రమైన నా మానసిక స్థితికి నాకే నావ్వొచ్చింది.

"కారణం లేకుండానే మళ్ళీ నవ్వు తున్నారు..." నిష్ఠురంగా అన్నదామె.

ఏం కారణంం చెప్పను? అన్నిటికీ కారణాలుంటాయా?

"ఏం లేదు... మలేషియా అమ్మాయిలు చాలా అందంగా ఉంటారని అంటారు. ఎందుకని?" విషయం మారుస్తూ అన్నాను.

"అందంగా ఉంటారు కాబట్టి" నవ్వింది తను. "బైదిబై... నేను మాత్రం అంత అందంగా వుండను సుమండీ!" అంటూ చక్రాల బండిని తోస్తూ ముందుకెళ్ళిపోయింది.

మా ఆవిడ 'ఖళ్...ఖళ్...' మని దగ్గడంతో

ఈ లోకంలోకి వూడిపడ్డాను. ఘ్లూతో బాధ పడుతున్నది తను. జలుబు బాగా ముదిరి దగ్గులోకి దిగింది. స్వెట్టర్ వేసుకుందో లేదోనని చూశాను. "బాగా చలివేస్తున్నదండీ" అనుకుంటూ ముడుచు కొని కూర్చుంది. సీట్లో ఉన్న రగ్గు తీసి కప్పాను. ఆమె నిర్విరామంగా దగ్గుతూనే ఉంది.

ట్రేలో జ్యూస్ గ్లాసులు, విస్కీ గ్లాసులు పెట్టుకొని వచ్చింది ఎయిర్ హోస్టెస్. ఎవరిక్కా వలసినవి వాళ్ళు అందుకుంటున్నారు.

"దయచేసి ఏసీ ఆఫ్ చేస్తారా?" అని అడిగాను. మా సీట్ల పైభాగాన 'కప్పు'కు వున్న స్విచ్ ఆఫ్ చేసింది ఎయిర్‌హోస్టెస్. నాలుగ్గంటల్లో కౌలాలంపూర్ చేరుకున్నాం. అక్కడ అంతా దిగిపోయారు. కొత్త బోర్డింగ్ పాస్‌లు తీసుకొని మళ్ళీ విమానం ఎక్కాం. ఈ సారి చాలా తక్కువమంది ప్రయాణీకులతో విమానం బయలుదేరింది మా వెనుక దూరంగా నలుగురైదుగురు మాత్రమే కూచొని వున్నారు.

మళ్ళీ ఆ మెరుపు తీగె టిష్యూ పేపర్లు పట్టుకొని వచ్చింది. చందనపు వృక్షాలను సుతారంగా తాకుతూ వీచే మలయమారుతంలా ఆమె ఒంటినుండి గుబాళిస్తున్న పరిమళాలు అలలు అలలుగా వ్యాపిస్తున్నాయి. నా మనసు పసిపిల్ల వాడిలా మారాం చేస్తుంది. దాని కవ్వింతలకు, ఎత్తుగడలకూ నేను తట్టుకోలేకపోతున్నాను. ఎగసి పడుతున్న మనసు ఆట కట్టించడానికి హ్యాండ్ లగేజి లోంచి ఓపుస్తకం తీసి చదవటం మొదలెట్టాను. పేజీలలోని పంక్తుల వరుసల్లో, వూరిమీద పడ్డ ఆబోతులా అడ్డదిడ్డంగా మనసు పరుగెత్తుతుంది. దానికి ముక్కుతాడు వెయ్యడం నావల్ల కావడం లేదు.

ఎయిర్‌హోస్టెస్ ఓరకంట నన్నే గమని స్తున్నది. ఇక లాభం లేదని పుస్తకం మూసేశాను. ఆమెతో మాటలు కలపాలని మనసు ఆరాట పడుతున్నది.

"మీ మలేషియాను గురించి తెలుసుకోవాలని ఉంది" అన్నాను ఆమెను కదిలిస్తూ.

"ఏం తెలుసుకుంటారు?" అన్నది ముక్తసరిగా.

"మీ ప్రజల గురించి. వాళ్ల జీవన విధానం గురించి... ఏదైనా చెప్పండి...అబ్బా... అంతులేని యీ ఫసిఫిక్ మహా సముద్రం మీద ఇరవై అయిదు-ఇరవై ఆరుగంటలు ప్రయాణించాలంటే మహా బోర్‌గా వుంది" అన్నాను.

"మీ గమ్యానికి నాలుగైదు గంటలు చేరువైనందుకు సంతోషించండి" అన్నది నవ్వు కుంటూ.

"నేనడిగిన విషయం దాటవేశారు" జ్ఞాపకం చేశాను.

"ఓ.. అదా... మాదేశం ప్రజల్లో అరవై శాతానికి పైగా ఇస్లాం మతానికి చెందిన వారే ఉన్నారు. బుద్ధిజమ్, క్రిష్టియానిటీ, హిందూయిజం, కన్ఫ్యూజనిజం, తావోయిజాలకు చెందిన వాళ్ళు కూడా వున్నారు. ఇంకా అనిమిస్టులు, సిక్కులు, బహాయిలు కూడా వున్నారు..." అంది, జ్ఞాపకం చేసుకుంటున్నట్టుగా కళ్ళు అర్ధనిమీలితం చేసి.

డైరీ తీసి, అందులో ఆమె చెప్పిన విషయాలు రాసుకుంటూ "మీ దేశంలో ఏయే భాషలు మాట్లాడతారు?" అని అడిగాను.

"మా జాతీయ భాష 'మలే', చైనా నుండీ, ఇండియా దక్షిణ ప్రాంతం నుండీ, ఇంకా యితర ప్రాంతాల నుండీ వచ్చిన వాళ్ళు తమ తమ భాషల్నే మాట్లాడతారు. మలేయుల సనాతన సంప్రదాయాలు పల్లెటూళ్ళలో ఇప్పటికీ సజీవంగానే వున్నాయి. ఆయా ప్రాంతాలకు చెందిన మాండలికాలు కూడా ప్రాచుర్యంలో వున్నాయి. ఇక్కడి ఆదివాసీల గురించి నాక్కూడా సరిగా తెలియదు... ఐదుశాతం మంది సార్‌వాక్, దయాక్‌లాంటి గిరిజన తెగలు వారి వారి చిత్రమైన భాషల ఉనికిని కాపాడుకుంటూ వస్తున్నారు..." వాళ్ళ దేశం గురించి చెబుతున్నప్పుడు ఆమె ముఖం సంతోషంతో విప్పారింది.

"మీరు ఏ ప్రాంతం వారు?" ఆ సక్తిగా అడిగాను.

"కౌలా కంగ్ సార్ పేరు వినే ఉంటారు. అక్కడి ప్రార్ధనా మందిరం చాలా ప్రసిద్ధి చెందింది. నేను అక్కడే పుట్టాను. మాది సంప్రదాయ ముస్లిం కుటుంబం. మానాన్న అక్కడికి దగ్గరగా ఉన్న పల్లెటూరికి చెందిన వాడు. రబ్బరు పరిశ్రమలో కార్మికునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించాడు" అన్నది. కుటుంబం గురించి చెబుతున్నపుడు ఆమె కళ్ళలో కించిత్ గర్వం తొణికిసలాడింది.

"మీరు ఎయిర్‌హోస్టెస్ ఎలా అయ్యారు?" కుతూహలంగా అడిగాను.

"చిన్నప్పటి నుండి మా నాన్నగారు నన్ను సంప్రదాయ ముస్లిం అమ్మాయి గానే పెంచారు...

ఆమతవిద్యలూ, కట్టుబాట్లూ నా ఒంటికి సరిపడేవి కావు. కలలు కనడం అంటే నాకిష్టం. అంతులేని ఈ విశాల ప్రపంచాన్ని చుట్టిరావాలని, ప్రపంచంలోని రకరకాల మనుషుల్ని-వాళ్ళ జీవన శైలిని పరిశీలించాలని అనుకునేదాన్ని. రెక్కలు విప్పుకుని ఆకాశంలోకి ఎగిరి పోతున్నట్టు తరచుగా కలలు వచ్చేవి. నా కలలకు అనుగుణంగానే నా జీవితాన్ని నేను మలచుకోగలిగాను. "ఆ కలల తాలూకు వెలుగు ఆమె కళ్ళలో ప్రతిఫలిస్తుంటే అందమైన ఆమెకళ్ళు ఇంకా అందంగా వెలుగుల నింపుకొని మెరుస్తున్నాయి.

"మీ కలల్ని సాకారం చేసుకునేందుకు సంప్రదాయాలూ, కట్టుబాట్లు అడ్డురాలేదా?" ఆరా తీస్తున్నట్టుగా అడిగాను.




గోవాలోని ఇనిస్టిట్యూట్ మెనీజస్ బ్రగంజా ఆర్ట్ గ్యాలరీ అధ్వర్యంలో డా॥ఎన్.గోపి రచించిన 'గోవాలో సముద్రం' కావ్యం హిందీ అనువాద గ్రంథాన్ని (సముద్ర్, మైబెరిగోవా) ప్రముఖ కొంకణి, హిందీ కవి శ్రీరమేష్ భగవంత్ వెలుస్కర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో కృతి స్వీకర్త, ఇనిస్టిట్యూట్ వైస్ చైర్మన్ శ్రీ మోహన్‌దాస్ సుర్లకర్, ఆవిష్కర్త వెలుస్కర్, మూలకవి గోపి, మెంబర్ సెక్రెటరీ శ్రీ అశోక్ పరబ్ ఉన్నారు.

"ఇవాళ మలేషియాలో యూత్ ప్రాక్టికల్ ప్రపంచంవైపు పరుగులు తీస్తుంది. ఐదుసార్లు నమాజు, బురఖా ధరించడంలాంటివి పెద్దగా పాటించడం లేదు. అఫ్‌కోర్స్... రంజాన్ నెలలో ఉపవాసాలుండడం, శుక్రవారం నమాజు చెయ్యడం మామూలే..." అందామె, నేటి యువతారనికి ప్రాతినిధ్యం వహిస్తున్న తానే అందుకు సాక్ష్యం అన్నట్టుగా ఉన్నాయి ఆమె హావభావాలు.




"అవునూ... అన్నట్టు... మీపేరేంటో చెప్పనే లేదు" అన్నాను.

"నూరజ్జెజర్" అన్నది కళ్ళు కొంచెం కిందికి వాల్చి. "అదిసరే... ఈ విషయాలన్నీ మీకెందుకు?" సూటిగా నాకళ్ళలోకి చూస్తూ అడిగింది.

"ఏ ప్రాంతంలో పర్యటిస్తే, ఆ ప్రాంతం సమాచారం తెలుసుకోవడం నాకిష్టం. చాలా విషయాలు చెప్పారు, థ్యాంక్స్" అన్నాను.

"మీరు ఎత్‌నాలజిస్టా?" అని అడిగింది.

"నో..." ఏం చెప్పాలో తోచలేదు. "హ్యూమనిస్టను" అన్నాను.

రెండు మూడు నిమిషాల్లో తైవాన్ రాజధాని-తైపీలో విమానం లాండ్ అవుతుందని ప్రకటించారు. నూరజ్జెజర్ గబగబా ముందుకు వెళ్ళిపోయింది. అందరం తైపీలో దిగాం. ట్రాన్సిట్ స్లిప్‌లు యిచ్చారు. మా ఆవిడ ఇంకా "ఖళ్ ఖళ్" మని దగ్గుతూనే ఉంది. తైపీలో గంట సమయముంది. బ్యాగ్‌లోంచి ట్యాబ్‌లెట్లు తీసి మా ఆవిడకిచ్చాను. ఆవిడ వేసుకుని స్వెట్టర్ సరిచేసుకుంది. గంట తరువాత మళ్ళీ విమానం ఎక్కాం.

చక్రాల తోపుడు బండిమీద భోజనాల పాకెట్లు తీసుకొచ్చింది నూర జ్జెజర్. తలా ఒకటి అందించింది. అంతా తినడంలో నిమగ్నమయ్యారు.

మెల్లగా నాదగ్గరికొచ్చింది. "మీరేం చేస్తువుంటారు?" అనడిగింది.

"చదవడం... అప్పుడప్పుడూ రాయడం...' అన్నాను.

"ఏం రాస్తుంటారు?" కుతూహలంగా అడిగింది.

"కవిత్వం...కథలూ...' కొంచెం ఇబ్బంది ఫీలవుతూ చెప్పాను.

"ఓ... రచయితలన్నమాట..." సంతోషంగా అన్నది.

"మీకు సాహిత్యంతో పరిచయముందా?" అన్నాను ఆమెవైపు చూస్తూ

"కొద్దిగా..." మొహమాటపడుతూ చెప్పింది.

"కాలేజీ రోజుల్లో కవిత్వం కూడా రాసేదాన్ని" అన్నది మనసు తెరమీద గతాన్ని ఆవిష్కరించు కుంటూ.

"ఓహ్! మీరూ కవయిత్రేనన్నమాట... మీరు రాసిన ఏదైనా కవిత జ్ఞాపకముంటే వినిపించండి" అన్నాను ఆమెలో ఉత్సాహాన్ని నింపుతూ.

"ఆ..వన్‌మినిట్" అంటూ తన మనసు పొరలలో కలగాపులగంగా అల్లుకున్న కవితల చిక్కుముడులలోంచి నెమ్మదిగా ఓ కవితను పైకి తీసి బిడియంగా వినిపించింది.

ఒక్కసారే నేను నిటారుగా అయ్యాను. కవితలోని భావం నారక్త నాళాల్లోకి చొచ్చుకుపోయి రక్తాన్ని పోటెత్తిస్తున్నది.

"ఓహ్! మార్వలెస్...గొప్ప ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్. ఎలిగాంట్ స్టైల్... పోయెమ్‌లోని విషాదం గుండెల్ని పిండుతున్నది..." ఎగ్జైట్ అవుతూ అన్నాను. కొంచెం సేపు మా యిద్దరి మధ్య మాటల కరువు తాండవించింది.

ముందుగా నేను తేరుకొని "మీరేమీ అను కోకపోతే... ఒక్కటడగాలనివుంది... మీరెవరినైనా ప్రేమించారా?" అన్నాను. తప్పకుండా ప్రేమించే వుంటుంది. ఆ ప్రేమ విఫలమయి కూడా ఉండి వుంటుంది. భగ్న ప్రేమికురాలు కాకుంటే కవితలో అంత విషాదాన్ని పలికించలేదు అను కున్నాను మనసులో.

ఆమె పకపకా నవ్వింది. "నేను ప్రేమించే దాకా ఎవరు ఆగారండీ బాబూ...! నా కవితలు నాలుగైదు, పత్రికల్లో వచ్చాయో లేదో 'ఐ లవ్ యూ...!' అంటూ గుంపులు గుంపులుగా కుర్రాళ్ళు ఎగబడ్డారు. దాంతో బెంబేలెత్తిపోయి, మళ్ళీ కవిత్వం జోలికి పోతే ఒట్టు" అన్నది నవ్వుల ప్రవాహాన్ని బలవంతగా ఆపుకుంటూ. "ప్రస్తుతం మంచి పుస్తకాలు చదవడంతోటే సరిపెట్టుకుంటున్నాను" అన్నది ముక్తాయింపుగా. "మళ్ళీ వస్తాను..." అంటూ నా వైపు ఓరగా చూసుకుంటూ వెళ్ళింది.

తైపీ నుండి ఫసిఫిక్ మహా సముద్రం మీద ఏకధాటిగా గంటల కొద్దీ ప్రయాణం. ఈ గంటలు విస్తరించి విస్తరించి కాలం అనే సముద్రంగా మారి నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నట్టుగా వున్నది. ఈ సముద్రం... ఆకాశం... కాలం ముందు మనిషి ఎంత అల్పుడు అనిపిస్తుంది.... ఏం తోచక విమాన గమనాన్ని సూచిస్తున్న బుల్లితెర మీద చూపులు నిలిపాను.

మన భారత కాలమానం ప్రకారం బహుశా తెల్లవారు ఝాము కావస్తుంది. ఫసిఫిక్ సముద్రం మీద జీరో డిగ్రీల ఫారెన్ హీట్ టెంపరేచర్ వణికిస్తున్నది. విమానంలో వున్న అతికొద్ది మంది ప్రయాణికులు కూడా చలికి ముడుచుకుని నిద్రపోతున్నారు. మా ఆవిడ కూడా ట్యాబ్‌లెట్ల మత్తులో మగతగా నిద్రలోకి జారుకుంది. ఎయిర్ హోస్టెస్‌లంతా ఎగ్జిక్యూటివ్ క్లాసులో విశ్రాంతి తీసుకుంటున్నట్టున్నారు.

"అయ్యో కాఫీ యిద్దాం అనుకున్నా... మేడం నిద్రపోతున్నట్టుంది కదా...?" అనుకుంటూ వచ్చింది నూరజ్జెజర్.

"ఆ... ఇప్పుడే దగ్గు కొంచెం తగ్గింది. నిద్రపోతుంది" అన్నాను.

"మీరు తీసుకోండి కాఫీ" అంటూ కాఫీ కప్పు అందించింది. వేడివేడి కాఫీ తాగుతుంటే ప్రాణాలు లేచివచ్చినట్టు అనిపించింది.

"అవునూ... యిందాక ఏవో పుస్తకాలు చదువుతారని చెప్పారు... ఇటీవల ఏంపుస్తకాలు చదివారు?" ఎందుకో ఆమెతో మళ్ళీ మళ్ళీ మాట్లాడాలని మనసు తహతహలాడుతున్నది.

కళ్ళు మూసుకొని కాసేపు ఆలోచించింది నూరజ్జెజర్.

"లవ్ పోయెమ్స్ ఆఫ్ టాగోర్ చదివాను. భావతరంగాలు అంతరాంత రాలలోకి వ్యాపించి ఆత్మను అవ్యక్త ప్రశాంతతలో ఓలలాడిస్తాయి ఆపోయెమ్స్. క్షణిక వ్యామోహం వైపు వెర్రిగా పరుగెత్తే ఇంద్రియాలకు పగ్గాలు వేసి ఎటర్నల్ లవ్ వైపు తీసుకెళతాయి. వెంపరలాడే మనసుకు గొప్ప సాంత్వన చేకూరుస్తాయి.." అంటూ తన వ్యాఖ్యానాలకు నేనెలా స్పందిస్తున్నానో గమనిస్తూ అన్నది.

"చాలా గొప్పగా... పొయెటిగ్గా చెప్పారు...' ఆమె విశ్లేషణా శక్తికి విస్మయం చెందుతూ అన్నాను. "ఇంకా ఏం చదివారు?" అని అడిగాను ఆమె

రసాత్మక హృదయంలోంచి జాలువారే అమృత వాక్కులను వినాలన్న తపనతో.

"పాలో కొయిలో రాసిన డచ్ నవల 'ద ఆల్కెమిస్ట్' చదివాను. అలాన్ ఆర్.క్లార్క్ ఇంగ్లీషులోకి రసవత్తరంగా అనువదించాడు. నమ్మశక్యం కాని సంఘటనలను కూడా వాస్తవాలుగా భ్రమింప చేయడంలో గొప్ప నేర్పు ప్రదర్శించాడు కొయిలో. అద్భుతమైన విశ్వాత్మను ఆవిష్కరించిన తీరు మనల్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది. చదవడం ప్రారంభిస్తే పూర్తయ్యేదాకా పుస్తకాన్ని మూసెయ్యలేం" అన్నది తూనీగ రెక్కల్లాంటి కనురెప్పల్ని రెపరెపలాడిస్తూ.

"ఇంకా చెప్పండి..." అన్నాను ఆమె చెప్పే తీరుకు ముగ్ధుణ్ణవుతూ.

"ఆ... పాబ్లో నెరూడా కవితలు చదివాను. జీవనోత్సాహాన్ని ఉత్తేజ పరిచే శక్తి నెరూడాకుంది. మనసును కవ్విస్తాయి, మండిస్తాయి, కలవరపాటుకు గురిచేస్తాయి నెరూడా కవితలు. ప్రత్యేకించి ఆయన లవ్ సానెట్ చదువుతుంటే కలేజా కత్తిమొన మీద పేలికలు చీలికలు అయిపోతున్నట్టనిపిస్తుంది..." తన్మయత్వంలో చెబుతున్నది నూరజ్జైజర్.

"కలత చెందిన కవి హృదయంలోంచే గొప్ప కవిత్వం పుడుతుంది. అంతర్లోకాలలో తనతో తాను యుద్ధం చేసుకునే కవే పాఠకుల మనసులో అలజడిని రగిలిస్తాడు" అన్నాను భావోద్వేగంతో.

"కాథరిన్ సిల్వర్ ఇంగ్లీషు అనువాదం 'ద పోస్ట్‌మన్' చదివారా? సముద్రతీరంలో వున్న చిన్న గ్రామం - ఇస్లానెగ్రాలో నెరూడా చివరిరోజులు గడుపుతున్నప్పుడు ప్రత్యేకంగా ఓ పోస్ట్‌మన్‌ను నియమించారు. ఆ పోస్ట్‌మన్ ఉద్విగ్న ప్రేమకథే ఆ నవల. "కవిత్వం రాసేవాళ్ళది కాదు. ఉపయోగించే వాళ్లదే" అని ఎంత అనుభవ పూర్వకంగా చెబుతాడు ఆ పోస్ట్‌మన్! నెరూడా కవితల్ని తన ప్రియురాలికి వినిపించి ఆమె హృదయాన్ని కొల్లగొడతాడు పోస్ట్‌మన్..." పరవశంగా చెప్పుకు పోతున్నది ఆమె.

"ఇవన్నీ చెప్పి... మీరు నా హృదయాన్ని కొల్లగొట్టుతున్నట్టు..." నా ప్రమేయం లేకుండానే హృదాంతరాళంలోంచి మాటలు తోసుకొని వచ్చాయి.

చివాలున తలెత్తి నా వైపు చూసింది నూరజ్జైజర్. కాంతిపుంజాలు విరజిమ్ముతూ రెండు నక్షత్ర గోళాలు హఠాత్తుగా భూమి మీద కలుసుకున్నట్లు మా చూపులు కలుసుకున్నాయి. ఒక్కసారే కాలం నిలిచిపోయినట్టనిపించింది. కాలం-స్థలం-దూరం... వీటన్నింటికీ అర్థాలు మారిపోతున్నట్టు ఒక అవ్యక్త భావన. ఆమె కళ్ళు అనంత భాషలను మాట్లాడుతున్నాయి. ఆ భాషలకు వ్యాకరణం లేదు. అసలు పదాలే లేవు. అన్ని భాషలూ కలగలిసిన... ఏ అనువాదానికీ లొంగని... పదాలు అక్కర్లేని... శబ్దం సవ్వడి లేని... రెండు ఆత్మలు చేరువై విస్ఫోటించే... మౌన భాష...! మలయ మారుతాలు, తుఫాన్లు, ఎడారులు, సముద్రాలు.... సృష్టి రహస్యమంతా ఆమె కళ్ళలో ప్రతిఫలిస్తుంది.

"లోహాన్ని దాని అత్యున్నత పరిణామ దశకు తీసుకువెళ్ళి బంగారంగా మార్చే పరుసవేదులు ప్రపంచంలో ఒకరో యిద్దరో ఉండివుంటారు. ప్రేమను దాని మహోన్నత పరిణామదశకు చేర్చే 'ప్రేమ వేది' కోసం స్త్రీ యుగాలుగా అన్వేషిస్తున్నది..." మరో లోకంలో సంచరిస్తున్న వ్యక్తిలా తనలో తాను గొణుక్కున్నట్టు అన్నది ఆమె.

"మీ అన్వేషణ ఎంతవరకొచ్చింది?" శోధిస్తున్నట్టుగా ఆమె అంతరంగంలోకి తొంగిచూస్తూ అడిగాను.

"ఆ..." తుళ్ళిపడి చక్రాల బండిని వేగంగా తోస్తూ వెళ్ళిపోయింది. ఓ అయిదు నిముషాల తరువాత ఏదో ట్రాన్స్‌లో వున్న మనిషిలా తిరిగి వచ్చింది.

"ఈ అనంత కాలగమనంలో క్షణాల అస్తిత్వం అతిస్వల్పమే కావచ్చు, ఆకొన్ని క్షణాలే అనంతంగా విస్తరించి జీవితాంతం వెంటాడుతుంటాయి. అలాంటి మరపురాని కొన్ని క్షణాలకు మీరు జీవం పోశారు... జీవితంలో తిరిగి మనం కలుసుకోక పోవచ్చు... ఇది నా పుట్టిన రోజు కోసం స్పెషల్‌గా ఆర్డరిచ్చి తయారు చేయించిన పెన్ను... దీన్ని మీకు బహుకరిస్తున్నాను. దయచేసి వద్దు అనద్దు... కనీసం... దీంతో రాసినపుడన్నా నేను జ్ఞాపకం వస్తాను..." అని తన పాకెట్‌లోంచి అపురూపంగా వున్న పెన్నును తీసిచ్చింది నూరజ్జైజర్.

"థాంక్యూ..." అన్నాను పెన్ను అందుకుంటూ. ఓ క్షణం పెన్నును అంటూ తిప్పి చూశాను. బంగారు పూత పూసిన పెన్ను మీద 'నూరజ్జైజర్' అన్న అక్షరాలు రాళ్ళతో పొదిగివున్నాయి. పసిఫిక్ మహా సముద్రం కొన్ని క్షణాల పాటు మౌనంగా ఘనీభవించినట్టనిపించింది. మౌనాన్ని చీల్చుకుంటూ "నాలుగైదు నిమిషాల్లో లాస్ ఏంజిల్స్‌లో ల్యాండ్ అవుతాం... విష్ యూ హేపీ అండ్ ప్రాస్పరస్ లైఫ్...బై..." అన్నది షేక్ హ్యాండ్ యిస్తూ. ఆ ఆర్ద్రమైన క్షణాలకు సాక్షిగా ఆమె కళ్ళల్లో తడి. గుండెను ఏదో మెత్తని కోత కోస్తుంటే "బై..." అన్నాను దిగులుగా.



హైదరాబాదు శ్రీత్యాగరాయగానసభలో మానస ఆర్ట్‌థియేటర్స్, గానసభల ఆధ్వర్యంలో జరిగిన సభలో డా॥జి.వి.ప్రసాదరావు రచించిన 'శ్రీకృష్ణస్తోత్ర మాలిక' గ్రంథాలను ఆవిష్కరిస్తున్న దూరదర్శన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఓలేటి పార్వతీశం. చిత్రంలో మానస కార్యదర్శి రఘుశ్రీ, గ్రంథకర్త, దైవజ్ఞ శర్మ, పులివర్తి కృష్ణమూర్తి, కొంపెల్ల శర్మ, దీక్షితులు ఉన్నారు.